అథ ఏకోనవింశోऽధ్యాయః

సతీకల్యాణము - శివలీల

బ్రహ్మోవాచ |

కృత్వా దక్షస్సుతా దానం ¸ంతకం వి విధం దదౌ | హరాయ సుప్రసన్నశ్చ వివిధం ధనమ్ || 1

అథ శంభు ముదా గత్య సముత్థాయ కృతాంజలిః | సార్థం కమలయా చేదమువాచ గరుడధ్వజః || 2

బ్రహ్మ ఇట్లు పలికెను -

దక్షుడు కన్యాదానమును చేసి శివునకు అనేక వస్తువులను సారెగా నిచ్చి, మిక్కిలి ప్రసన్నుడై వివిధ సంపదలను బ్రాహ్మణులకు ఇచ్చెను (1). అపుడు గరుడధ్వజుడగు విష్ణువు లక్ష్మీదేవితో గూడి శివుని వద్దకు వచ్చి దోసిలియొగ్గి ఇట్లు పలికెను (2).

విష్ణురువాచ |

దేవదేవ మహాదేవ కరుణా సాగర ప్రభో | త్వం పితా జగతాం తాత సతీ మాతాఖిలస్య చ || 3

యువాం లీలావతారౌ వై సతాం క్షేమాయ సర్వదా | ఖలానాం నిగ్రహార్థాయ శ్రుతిరేషా సనాతనీ || 4

స్నిగ్ధ నీలాంజన శ్యామ శోభయా శోభ##సే హర | దాక్షాయణ్యా యథా చహం ప్రతిలోమేన పద్మయా || 5

దేవానాం వా నృణాం రక్షాం కురు సత్యానయా సతామ్ | సంసారసారిణాం శంభో మంగలం సర్వదా తథా || 6

య ఏనాం సాభిలాషో వై దృష్ట్వా శ్రుత్వాథవా భ##వేత్ | తం హన్యాస్సర్వభూతేశ విజ్ఞప్తిరితి మే ప్రభో || 7

విష్ణువు ఇట్లు పలికెను -

దేవదేవా!మహాదేవా!కరుణా సముద్రా! హే ప్రభో! తండ్రీ! ఈ జగత్తులన్నిటికీ నీవు తండ్రివి. సతి తల్లి (3). మీరు సర్వదా సత్పురుషుల క్షేమము కొరకు, దుష్టుల నిగ్రహము కొరకు లీలచే అవతరించెదరని సనాతనమగు వేదము వక్కాణించుచున్నది (4). హే హరా! చిక్కని నల్లని కాటుక వలె శ్యామ వర్ణముతో శోభిల్లు సతితో గూడి యున్న గౌరవర్ణము గల నీవు, గౌరవర్ణము గల లక్ష్మితో శ్యామవర్ణముగల నేను వలె, శోభిల్లు చున్నావు (5). హే శంభో! నీవు దేవతలలో, మరియు మానవులలో గల సత్పురుషులను ఈ సతీదేవితో గూడి రక్షింపుము. ఈ సంసారములో సారభూతులగు సత్పురుషులకు సర్వదా మంగళము గలుగు గాక! (6). హే సర్వభూతేశ్వరా! ఈమెను ఎవరైతే అభిలాషతో చూచునో,వానిని నీవు సంహరింపుము. ఇది నా విన్నపము (7).

బ్రహ్మోవాచ |

ఇతి శ్రుత్వా వచో విష్ణోర్విహస్య పరమేశ్వరః | ఏవమస్త్వితి సర్వజ్ఞః ప్రోవాచ మధుసూదనమ్ || 8

స్వస్థానం హరిరాగత్య స్థిత ఆసీన్మునీశ్వర | ఉత్సవం కారయామాస జుగోప చరితం చ తత్ || 9

అహం దేవీం సమాగత్య గృహ్యోక్తవిధినాఽఖిలమ్ | అగ్నికార్యం యథోద్దిష్టమకార్షం చ సువిస్తరమ్ || 10

తతశ్శివా శివైశ్చైవ యథావిధి ప్రహృష్టవత్ | ఆగ్నేః ప్రదక్షిణం చక్రే మదాచార్య ద్విజాజ్ఞయా || 11

బ్రహ్మ ఇట్లు పలికెను -

విష్ణువు యొక్క ఈ మాటను విని సర్వజ్ఞుడగు పరమేశ్వరుడు నవ్వి,'అటులనే అగుగాక!' అని మధు సూదనునితో పలికెను (8). ఓ మహర్షీ! అపుడు విష్ణువు తన స్థానమునకు తిరిగి వచ్చి, ఉత్సవమును చేయించెను. మరియు ఆ వృత్తాంతమును రహస్యముగా నుంచెను (9). నేను గృహ్య సూత్రములో చెప్పిన విధముగా హోమాది కార్యములనన్నిటినీ విస్తారముగా యథావిధిగా సతీశివులచే చేయించితిని (10). అపుడు సతీశివులు ఆనందించి, ఆచార్యుడనగు నేను, మరియు ఇతర బ్రాహ్మణులు ఆజ్ఞాపించగా యథావిధిగా అగ్ని ప్రదక్షిణమును చేరిసి (11).

తదా మహోత్సవస్తత్రాద్భుతోఽభూద్ద్వి జసత్తమ | సర్వేషాం సుఖదం వాద్యం గీతనృత్య పురస్సరమ్ || 12

తదానీ మద్భుతం తత్ర చరితం సమభూదితి | సువిస్మయకరం తాత తచ్ఛృణు త్వం వదామి తే || 13

దుర్ జ్ఞేయా శాంభవీ మాయా తయా సంమోహితం జగత్ | సచరాచరమత్యంతం స దేవాసురమానుషమ్ || 14

యోఽహం శంభుం మోహయితుం పురై చ్ఛం కపటేనహ | మాం చ తం శంకరస్తాత మోహయా మాస లీలయా || 15

ఓ ద్విజశ్రేష్ఠా! అపుడచట అద్భుతమగు మహోత్సవము ప్రవర్తిల్లెను. దానిలోని వాద్యములు, గీతములు, నృత్యములు సర్వులకు సుఖమును కలిగించెను (12). అపుడచట అత్యాశ్చర్యకమైన అద్భుత వృత్తాంతము ఘటిల్లెను వత్సా! దానిని నీకు చెప్పెదను వినుము (13). శంభు మాయను తెలియుట మిక్కిలి కష్టము. ఆ మాయ చే జగత్తు పూర్తిగా మోహింపబడి యున్నది. దేవతలు, రాక్షసులు, మనుష్యులుతో సహా చరాచరజగత్తు ఆ మాయచే మిక్కిలి మోహమును చెందియున్నది (14). పూర్వము నేను కపటో పాయముచే శంభుని మోహింపజేయ గోరితిని. వత్సా! అట్టి నన్ను శంకరుడు అవలీలగా మోహింపజేసెను (15).

ఇచ్ఛేత్పరాపకారం యస్స తస్మై#్యవ భ##వేద్ధ్రువమ్ | ఇతి మత్వాపకారం నో కుర్యాదన్యస్య పూరుషః || 16

ప్రదక్షిణాం ప్రకుర్వంత్యా వహ్నే స్సత్యాః పదద్వయమ్ | ఆవిర్బ భూవ వసనాత్తద ద్రాక్ష మహం మునే || 17

మదనా విష్టచే తాశ్చ భూత్వాంగాని వ్యలోకయమ్ | అహం సత్యా ద్విజశ్రేష్ఠ శివమాయా విమోహితః || 18

యథా యథాహం రమ్యాణి వైక్షమంగాని కౌతుకాత్ | స్త్యా బభూవ సంహృష్టః కామార్తో హి తథా తథా || 19

ఇతరులకు ఎవరు అపకారమును తలబెట్టెదరో, అది వారికే జరుగుట నిశ్చయము. ఈ సత్యము నెరింగి మానవుడు ఇతరులకు అపకారమును చేయరాదు (16). ఓమహర్షీ! సతీదేవి అగ్నికి ప్రదక్షిమమును చేయు చుండగా చీర తొలగి ఆమె పాదములు రెండు కనబడ జొచ్చివని. నేను వాటిని చూచితిని (17). ఓ ద్విజ శ్రేష్ఠా! శివమాయచే విమోహితుడనైన నేను మన్మథునిచే ఆవేశింపబడిన మనస్సు గలవాడనై సతీదేవి యొక్క అంగములను చూచితిని (18). నేను సతీదేవి యొక్క అంగములను హర్షముతో ఉత్కంఠతో చూచు చుండగా, నాలోని కామవేదన అధికము కొజొచ్చెను (19).

అహమేవం తథా దృష్ట్వా దక్షజాం చ పతివ్రతామ్ | స్మరావిష్టమనా వక్త్రం ద్రుష్టకామోఽభవం మునే || 20

న శంభోర్లజ్జయా వక్త్రం ప్రత్యక్షం చ విలోకితమ్ | న చ సా లజ్జ యావిష్టా కరోతి ప్రకటం ముఖమ్ || 21

తతస్తద్దర్శనార్థాయ సదుపాయం విచారయన్ | ధూమ్ర ఘోరేణ కామార్తోఽకార్షం తచ్చ తతః పరమ్ || 22

ఆర్ద్రేంధనాని భూరీణి క్షిప్త్వా తత్ర విభావసౌ | స్వల్పాజ్యాహుతి విన్యాసా దార్ద్ర ద్రవ్యోద్భవస్తథా || 23

ఓ మహర్షీ! పతివ్రతయగు దాక్షాయణిని నేను ఈ తీరున చూచి మన్మథునిచే ఆవేశింపబడిన మనస్సు గలవాడనై ఆమె ముఖమును చూడగోరితిని (20). నేను సిగ్గుచే శంభుని ముఖమును ప్రత్యక్షముగా చూడలేదు. ఆమె సిగ్గుచే తన ముఖమును కనబడ కుండునట్లు కప్పుకొని యుండెను (21). ఆమె ముఖమును చూచే మంచి ఉపాయమును గూర్చి నేను ఆలోచించితిని. ఘోరమగు పాపప్రభావముచే నేను కామ పీడితుడనై అపుడొక పనిని చేసితిని (22). అచట అగ్ని యందు పచ్చి కర్రలను అధికముగను, ఆజ్యాహుతిని అల్పముగను వేసి తడి ద్రవ్యము అధికముగ నుండునట్లు చేసితిని (23).

ప్రాదుర్భూతస్తతో ధూమో భూయాంస్తత్ర సమంతతః | తాదృగ్ యేన తమో భూతం వేదీ భూమిలవినిర్మితమ్ || 24

తతో ధూమాకులే నేత్రే మహేశః పరమేశ్వరః | హస్తాభ్యాం ఛాదయామాస బహులీలాకరః ప్రభుః || 25

తతో వస్త్రం సముత్క్షిప్య సతీవక్త్రమహం మునే | అవేక్షం కిల కామార్తః ప్రహృష్టేనాంతరాత్మనా || 26

ముహుర్ముహు రహం తాత పశ్యామి స్మ సతీముఖమ్ | అథేంద్రియ వికారం చ ప్రాప్తవానస్మి సోఽవశః || 27

అపుడు అచట అంతటా పొగ అధికముగా వ్యాపించి, వేది సమీప భూమి అంతయూ చీకటి నిండినట్లు ఆయెను (24). అపుడు పరమేశ్వరుడగు మహేశ్వరుడు పొగతో నిండిన కళ్లను రెండు చేతులతో ముసుకొనెను. ఆ ప్రభువు అనేక లీలలను ప్రదర్శించును గదా!(25). ఓ మహర్షీ! అపుడు నేను వస్త్రమును పైకి తీసి సతీ దేవి ముఖమును సంతోషముతో నిండిన మనస్సు గలవాడనై చూచి కామ

పీడితుడనైతిని (26). వత్సా! నేను సతీదేవి ముఖమును అనేక పర్యాయములు చూచి ఇంద్రియ వికారమును పొందితిని. నా మనస్సు నా వశములో లేకుండెను (27).

మమ రేతః ప్రచస్కంద తతస్తద్వీక్షణాద్ధ్రుతమ్ | చతుర్బిందు మితం భూమౌ తుషారచయసంనిభమ్ || 28

తతోఽహం శంకితో మౌనీ తత్ క్షణం విస్మితో మునే | ఆచ్ఛాదయే స్మతద్రేతో యథా కశ్చిద్బుభోధన || 29

అథ తద్భగవాన్ శంభుర్ జ్ఞాత్వా దివ్యేన చక్షుషా | రేతోఽవస్కందనాత్తస్య కోపాదేత దువాచ హ || 30

ఆమెను చూచుట వలన మంచు ముద్దవలె నున్న నాల్గు బిందువుల పరిమాణము గల నా రేతస్సు భూమిపై జారిపడెను (28). ఓ మహర్షీ! నేను ఆ క్షణములో విస్మయమును చెంది భయపడినవాడనై ఏమియూ మాటలాడకుండగా, ఆ రేతస్సును ఇతరులకు కానరాకుండునట్లు కప్పివేసితిని (29). అపుడు భగవాన్ శంభుడు దివ్యదృష్టిచే ఆ విషయమును తెలుసుకొనెను. రేతస్సేకము జరుగుటచే ఆయనకు చాల కోపము వచ్చెను. ఆయన ఇట్లు పలికెను (30).

రుద్ర ఉవాచ |

కిమేతద్విహతం పాప త్వయా కర్మ విగర్హితమ్ | వివాహే మమ కాంతాయా వక్త్రం దృష్టం న రాగతః || 31

త్వంవేత్సి శంకరేణైతత్కర్మా జ్ఞాతం న కించన | త్రైలోక్యేఽపి నమేఽజ్ఞాతం గూఢం తస్మాత్కంథం విధే || 32

యత్కించిత్త్రిషు లోకేషు జంగమం స్థావరం తథా | తస్యాహం మధ్యగో మూఢతైలం యద్వత్తి లాంతికమ్ || 33

ఓరీ పాపీ! నీవిట్టి జుగుప్సితమగు కర్మను ఏల చేసితివి ?నీవు వివాహములో నా భార్య యొక్క ముఖమును అనురాగముతో చూడలేదు (31). శంకరునకు తెలియనిది ఏదియూ ఉండదని నీవు ఎరుంగుదువు. ముల్లోకములలో నైననూ నాకు తెలియని రహస్యము లేదు. హే విధే! ఇట్లు ఏల చేసితివి?(32). హేమూఢా!ఈ ముల్లోకములలో సమస్త చరాచర ప్రాణి సమూహములోపల నేను తిలలయందు తైలము వలె వ్యాపించి యున్నాను (33).

బ్రహ్మో వాచ |

ఇత్యుక్త్వా ప్రియవిష్ణుర్మాం తదా విష్ణువచస్స్మరమ్ | ఇయేష హంతుం బ్రహ్మాణం శూలముద్యమ్య శంకరః || 34

శంభునోద్యమితే శూలే మాం చ హంతుం ద్విజోత్తమ | మరీచి ప్రముఖాస్తే వై హాహాకారం చ చక్రిరే || 35

తతో దేవగణాస్సర్వే మునయశ్చాఖిలాస్తథా | తుష్టువు శ్శంకరం తత్ర ప్రజ్వలంతం భయంకరమ్ || 36

బ్రహ్మ ఇట్లు పలికెను -

విష్ణువు ప్రియమైన వాడుగా గల శంకరుడు అపుడు ఇట్లు పలికి, విష్ణువుమాటను స్మరించి, శూలమునెత్తి బ్రహ్మను సంహరింప నుద్యమించెను (34). హే ద్విజశ్రేష్ఠా! శంభుడు శూలమునెత్తి నన్ను చంపుటకు సిద్ధపడగా, మరీచి మొదలగు వారందరు హహాకారములను చేసిరి (35). అపుడు సర్వదేవగణములు, మునులు మరియు ఇతరులు అందరు, మండిపడుతూ భయంకరముగానున్న శంకరుని స్తుతించిరి (36).

దేవా ఊచుః |

దేవ దేవ మహాదేవ శరణా గతవత్సల | బ్రహ్మాణం రక్ష రక్షేశ కృపాం కురు మహేశ్వర || 37

జగత్పితా మహేశ త్వం జగన్మాతా సతీ మతా | హరిబ్రహ్మాదయస్సర్వే తవ దాసాస్సురప్రభో|| 38

అద్భుతాకృతి లీలస్త్వం తవ మాయాద్భుతా ప్రభో | తయా విమోహితం సర్వం వినా త్వద్భక్తి మీశ్వర || 39

దేవతలు ఇట్లు పలికిరి -

హే దేవదేవా! మహాదేవా! నీవు శరణుజొచ్చిన వారిని ప్రేమతో రక్షించెదవు. ఈశ్వరా! బ్రహ్మను రక్షింపుము. మహేశ్వరా!దయను చూపుము (37). మహేశ్వరా! నీవు జగత్తునకు తండ్రివి. సతీదేవి జగన్మాత. హే దేవ ప్రభో! హరిబ్రహ్మాదులందరు నీకు దాసులు (38). నీ ఆకారము, నీ లీలలు అద్భుతమైనవి. హే ప్రభో! నీ మాయ అద్భుతమైనది. హే ఈశ్వరా! నీ భక్తి లేని వరినందరినీ ఆ మాయ మోహింపజేయును (39).

బ్రహ్మోవాచ |

ఇత్థం బహుతరం దీనా నిర్జనా మునయశ్చ తే | తుష్టువుర్దేవదేవేశం క్రోధావిష్టం మహేశ్వరమ్ || 40

దక్షో మైవం మైవమితి పాణి ముద్యమ్య శంకితః | వారయా మాస భూతేశం క్షిప్రమేత్య పురోగతః || 41

అథాగ్రే సంగతం వీక్ష్య తదా దక్షం మహేశ్వరః | ప్రత్యువాచా ప్రియమిదం సంస్మరన్ ప్రార్ధనాం హరేః || 42

బ్రహ్మ ఇట్లు పలికెను -

క్రోధావేశమును పొందిన దేవదేవేశ్వరుడగు మహేశ్వరుని ఆ దేవతలు మరియు మునులు ఈ తీరున దీనముగా అనేక విధములుగా స్తుతించిరి (40). దక్షుడు భీతుడై వద్దు వద్దు అని పలుకుచూ వేగముగా ముందునకురికి చేతిని పట్టుకొని భూతనాథుడగు శివుని

ఆపివేసెను (41). అపుడు మహేశ్వరుడు విష్ణువు యొక్క అభ్యర్థనను స్మరించి, ముందునకు వచ్చిన దక్షుని చూచి, ఆతనిని ఉద్దేశించి ఈ అప్రియవచనములను పలికెను (42).

మహేశ్వర ఉవాచ |

విష్ణునా మేఽతి భ##క్తేన యదిదానీ ముదీరితమ్ | మయాప్యంగీ కృతం కర్తుం తదిహైవ ప్రజాపతే || 43

సతీం యస్యాభిలాషస్సన్ వీక్షేత వధ తం ప్రభో | ఇతి విష్ణువచస్సత్యం విధిం హత్వా కరోమ్యహమ్ || 44

సాభిలాషస్సతీం బ్రహ్మ కథం సమవలోకయత్ | అభవత్త్యక్తరేతాస్తు తతో హన్మి కృతాగసమ్ || 45

మహేశ్వరుడిట్లు పలికెను -

ఓ ప్రజాపతీ! నాకు గొప్ప భక్తుడగు విష్ణువు నాకు ఇంతకు ముందు చెప్పిన సలహాను ఆచరించుటకు నేను అంగీకరించితిని. కాన, నేనా సలహాను ఇపుడు అక్కడ ఆచరణలో పెట్టెదను (43). ఓ ప్రభూ! సతిని కామనా దృష్టితో చూచు వానిని వధింపుమని విష్ణువు చెప్పియున్నాడు. నేను బ్రహ్మను వధించి ఆ మాటను సత్యము చేసెదను (44). బ్రహ్మ సతీదేవిని కామ దృష్టితో ఎట్లు చూడగల్గినాడు? పైగా రేతస్ఖలనము కూడ జరిగినది గనుక, ఈ పాపిని సంహరించెను (45).

బ్రహ్మోవాచ |

ఇత్యుక్తవతి దేవేశే మహేశే క్రోధసంకులే | చకింపిరే జనాస్సర్వే సదేవముని మానుషాః || 46

హాహాకారో మహానాసీదా దాసీన్యం చ సర్వశః | అభూవం వికలోఽతీవ తదాహం తద్విమోహకః || 47

అథ విష్ణు ర్మహేశాతి ప్రియః కార్య విచక్షణః | తమేవం వాదినం రుద్రం తుష్టావ ప్రణతస్సుధీః || 48

స్తుత్వా చ వివిధైస్తోత్రైశ్శంకరం భక్త వత్సలమ్ | ఇదమూచే వారయంస్తం క్షిప్రం భూత్వా పురస్సరః || 49

బ్రహ్మ ఇట్లు పలికెను -

దేవదేవుడగు మహేశ్వరుడు కోపముతో మండి పడుతూ ఇట్లు పలుకగానే దేవతలు, మునులు, ఇతరులు సర్వులు వణికి పోయిరి (46). గొప్ప హాహాకారము బయలు దేరెను. అందరు ఉదాసీనులై ఉండిరి. అపుడు నేనా ఘటనచే మోహితుడనై మిక్కిలి దుఃఖితుడనై యుంటిని (47). మహేశ్వరునకు మిక్కిలి ప్రియుడు, కార్యకుశలుడు, బుద్ధిశాలి యగు విష్ణువు అపుడు ఈ విధముగా పలుకుచున్న రుద్రునికి నమస్కరించి స్తుతించెను (48). భక్తవత్సలుడగు శంకరుని వివిధస్తోత్రములచే స్తుతించి, విష్ణువు ముందునకు వేగముగా వచ్చి ఆ రుద్రుని వారించుచూ ఇట్లు పలికెను (49).

విష్ణురువాచ |

విధిం న జహి భూతేశ స్స్రష్టారం జగతాం ప్రభుమ్ | అయం శరణగస్తేఽద్య శరణా గతవత్సలః || 50

అహం తేఽతి ప్రియో భక్తో భక్తరాజ ఇతీరితః | విజ్ఞప్తిం హృది మే మత్త్వా కృపాంకురు మమోపరి || 51

అన్యచ్చ శృణు మే నాథ వచనం హేతుగర్భితమ్ | తన్మనుష్వ మహేశాన కృపాం కృత్వా మమోపరి || 52

ప్రజాస్స్రష్టుమయం శంభో ప్రాదూర్భూతశ్చతుర్ము ఖః | అస్మిన్ హతే ప్రజాస్స్రష్టా నాస్త్యన్యః ప్రాకృతోఽధునా || 53

విష్ణువు ఇట్లు పలికెను -

భూతనాథా! సృష్టికర్త, జగత్ర్పభువు అగు బ్రహ్మను సంహరించవద్దు. ఈతడీనాడు నిన్ను శరణు పొందుచున్నాడు. నీవు శరణాగత వత్సలుడవు (50). నేను నీకు మిక్కిలి ప్రియమగు భక్తుడను. నాకు భక్తరాజు అను కీర్తి గలదు. నీవు నా విన్నపమును మన్నించి నాపై దయను చూపుము (51). హే నాథా! నేను యుక్తి యుక్త మగు మరియొక్క మాటను చెప్పెదను. వినుము. మహేశ్వరా! నీవు నాపై దయచేసి నా మాటను మన్నింపుము (52). హే శంభో! ఈ నాల్గు మోముల బ్రహ్మ ప్రజలను సృష్టించుటకే ఆవిర్భవించినాడు. ఈయనను సంహరించినచో మరియొక సృష్టికర్త ఉండడు. మరియొక సృష్టికర్తను నీవిదివరలో సృష్టించలేదు (53).

సృష్టి స్థిత్యంతకర్మాణి కరిష్యామః పునః పునః | త్రయో దేవా వయం నాథ శివరూప త్వదాజ్ఞయా || 54

ఏతస్మిన్నిహతే శంభో కస్త్వత్కర్మ కరిష్యతి | తస్మాన్న వధ్యో భవతా సృష్టికృల్లయకృద్విభో || 55

అనేనైవ సతీ కన్యా దక్షస్య చ శివా విభో | సదుపాయేన వై భార్యా భవదర్థే ప్రకల్పితా || 56

హే నాథా! శివరూపములో నున్న నీ ఆజ్ఞచే మనము త్రిమూర్తులము సృష్టిస్థితిలయ కర్మలను మరల మరల చేయు చుందుము (54). హే శంభో! ఈ బ్రహ్మను సంహరించినచో, ఆ సృష్టికర్మను ఎవరు చేసెదరు? హే లయకర్తా! హే ప్రభో! కావున నీవు సృష్టి కర్త యగు ఈతనిని సంహరించవలదు (55). దక్షుని కుమార్తె యగు సతీదేవి రూపములో నున్న ఉమా దేవిని, హే ప్రభో! ఈతడే మంచి ఉపాయముతో నీకు భార్య అగునట్లు వ్యవస్థను చేసినాడు (56).

బ్రహ్మోవాచ |

ఇత్యాకర్ణ్య మహేశస్తు విజ్ఞప్తిం విష్ణునా కృతా మ్ |
ప్రత్యువాచాఖిలాంస్తాంశ్చ శ్రావయంశ్చ దృఢవ్రతః || 57

బ్రహ్మ ఇట్లు పలికెను -

దృఢమగు వ్రతము గల మహేశ్వరుడు విష్ణువు చేసిన ఈ విన్నపమును విని, వారందరికి వినపడునట్లుగా, ప్రత్యుత్తరమును ఇట్లు చెప్పెను (57).

మహేశ ఉనాచ |

దేవదేవ రమేశాన విష్ణో మత్ప్రాణవల్లభ | న నివర్త యమాం తాత వధాదస్య ఖలస్త్వయమ్ || 58

పూరయిష్యామి విజ్ఞప్తిం పూర్వం తేంగీకృతం మయా | మహాపాపకరం దుష్టం హన్మ్యేనం చతురాననమ్ || 59

అహమేవ ప్రజాస్స్రక్ష్యే సర్వాస్థ్సి రచరా అపి |అన్యం స్రక్ష్యే సృష్టికరమథ వాహం స్వతేజసా || 60

హత్వైనం విధిమేవాహం స్వపణం పూరయన్ కృతమ్ | స్రష్టారమేకం స్రక్ష్యామి న నివారయ మేశ మామ్ || 61

మహేశ్వరుడిట్లు పలికెను -

హే దేవదేవా ! రమాపతీ ! విష్ణూ! నీవు నాకు ప్రాణములవలె ప్రియుడవు. వత్సా! నేనీతనిని సంహరింపబోగా నీవు నన్ను నివారించవద్దు. ఈతడు దుష్టుడు (58). పూర్వము నీవు చేసిన విన్నపమును నేను అంగీకరించితిని. దానిని ఇప్పుడు పూర్తిచెసెదను మహాపాపమును చేసినవాడు, దుష్టుడు, నాల్గు ముఖములు గలవాడు అగు ఈ బ్రహ్మను నేను సంహరించెదను (59). స్థావర జంగమాత్మకమగు సర్వప్రాణులను నేనే సృష్టించెదను. లేదా, నా శక్తిచే మరియొక సృష్టికర్తను నేను సృష్టించెదను (60). ఈ బ్రహ్మను సంహరించి, నేను చేసిన శపథమును పూర్తిచేసి, మరియొక సృష్టికర్తను సృజించెదను. ఓ లక్ష్మీ పతీ! నీవు నన్ను నివారించకుము (61).

బ్రహ్మోవాచ |

ఇతి తస్య వచశ్ర్శుత్వా గిరీశస్యాహ చాచ్యుతః | స్మిత ప్రభిన్న హృదయః పునర్మైవ మితీరయన్ || 62

బ్రహ్మ ఇట్లు పలికెను -

గిరీశుని ఈ మాటను విని, చిరునవ్వుతో ప్రకటమైన కరుణాహృదయము గల అచ్యుతుడు 'వద్దు' అని మరల పలుకుచూ, ఇట్లనెను (62).

అచ్యుత ఉవాచ |

ప్రతిజ్ఞాపూరణం యోగ్యం పరస్మిన్ పురుషేऽస్తివై | విచారయస్వ వధ్యేశ భవత్యాత్మని న ప్రభో || 63

త్రయో దేవా వయం శంభో త్వదాత్మానః పరా నహి | ఏకరూపా న భిన్నాశ్చ తత్త్వ తస్సువిచారయ || 64

తతస్తద్వచనం శ్రుత్వా విష్ణోస్స్వతి ప్రియస్యసః | శంభురూచే పునస్తం వై ఖ్యాపయన్నాత్మనో గతిమ్ || 65

అచ్యుతుడు ఇట్లు పలికెను -

పరమ పురుషుడవగు నీవు ప్రతిజ్ఞను చెల్లించు కొనుట యోగ్యమైన విషయమే. కాని, నీవు విచారించుము. హే ప్రభూ! ఈశ్వరా! తనను తాను వధించు కొనుట తగదు (63). హే శంభో! మనము త్రిమూర్తులము నీ స్వరూపులము గాన వేర్వేరు గాదు. మన స్వరూపము ఒక్కటి. ఈ తత్త్వమును నీవు విచారించుము (64). మిక్కిలి ప్రియుడగు విష్ణువు యొక్క ఆ మాటను విని అపుడా శంభుడు ఆత్మ స్వరూపమును ప్రకటింప చేయదలచి మరల ఆతనితో నిట్లనెను (65).

శంభురువాచ |

హే విష్ణో సర్వభ##క్తేశ కథమాత్మా విధిర్మమ | లక్ష్యతే భిన్న ఏవాయం ప్రత్యక్షేణాగ్రతస్థ్సితః || 66

శంభువు ఇట్లు పలికెను -

హే విష్ణో! నీవు భక్తులందరిలో శ్రేష్ఠుడవు. బ్రహ్మ నాకు ఆత్మ ఎట్లు అగును? ఈతడు నా కంటె భిన్నముగా ఎదురుగ నిలబడి ప్రత్యక్షముగ కనబడు చున్నాడు గదా! (66).

బ్రహ్మోవాచ |

ఇత్యాజ్ఞప్తో మహేశేన సర్వేషాం పురతస్తదా | ఇదమూచే మహాదేవం తోషయన్ గరుడధ్వజః || 67

బ్రహ్మ ఇట్లు పలికెను -

మహేశ్వరునిచే ఇట్లు ఆజ్ఞాపించబడిన, గరుడ ధ్వజుడు విష్ణువు మహాదేవుని సంతోషపెట్టుచున్నవాడై అపుడు అందరి యెదుట ఇట్లు పలికెను .

విష్ణురువాచ |

న బ్రహ్మ భవతో భిన్నో న త్వం తస్మాత్సదాశివ | న వాహం భవతో భిన్నో న మత్త్వం పరమేశ్వర || 68

సర్వం జానాసి సర్వ పరమేశ సదాశివ | మన్ముఖాదఖిలాన్సర్వం సంశ్రావయితుమిచ్ఛసి || 69

త్వదాజ్ఞాయా వదామీశ సృణ్వంతు నిఖిలాస్సురాః | మునయశ్చాపరేశ్చైవం తత్త్వం సంధార్య స్వం మనః || 70

ప్రధానస్యాప్రధానస్య భాగా భాగస్య రూపిణః | జ్యోతిర్మయస్య భాగాస్తే వయం దేవాః ప్రభోస్త్రయః || 71

విష్ణువు ఇట్లు పలికెను -

ఓ సదాశివా! బ్రహ్మ నీకంటె వేరుగాదు. నీవు ఆతని కంటె వేరు గాదు. మరియు, నేను నీకంటె వేరు గాదు. ఓ పరమేశ్వరా! నీవు నాకంటె వేరు గాదు (68). హేసర్వజ్ఞా!పరమేశా!సదాశివా!నీకంతయూ తెలియును. నీవు నా నోటిగుండా అందరికీ సర్వమును వినిపించ గోరుచున్నావు (69). ఈశా! నీ ఆజ్ఞచే శివతత్త్వమును నిలకడ అయిన మనస్సుతో చెప్పు చున్నాను. సర్వదేవతలు, మునులు, ఇతరులు వినెదరు గాక!(70). నీవు ప్రకృతి స్వరూపుడవు. ప్రకృతికి అతీతుడవు. లోకములో భిన్నముగా కనబడే సర్వము నీవే. కాని నీయందు భేదము లేదు. మనము త్రిమూర్తులము జ్యోతిర్మయుడగు శివుని అంశములైన దేవతలము (71).

కస్త్వం కోऽహం చ కో బ్రహ్మో తవైవ పరమాత్మనః | అంశత్రయమిదం భిన్నం సృష్టిస్థిత్యంతకారణమ్ || 72

చింతయస్వాత్మ నాత్మానం స్వలీలా ధృతా విగ్రహః | ఏకస్త్వం బ్రహ్మ సగుణో హ్యంశ భూతా వయం త్రయః || 73

శిరో గ్రీవాది భేదేన యథైకస్సై#్యవ వర్ష్మణః | అంగాని తేతథేశస్య తస్య భాగత్రయం హర || 74

యజ్జ్యోతిరభ్రం స్వపురం పురాణం కూటస్థమవ్యక్త మనంత రూపమ్ |

నిత్యం చ దీర్ఘాది విశేషణాద్యైః హీనం శివస్త్వం తత ఏవ సర్వమ్ || 75

నీవెవరు?నేనెవరు? బ్రహ్మ ఎవరు? పరమాత్మయగు నీ మూడు అంశములు సృష్టిస్థితిలయ నిర్వహణ కొరకై మూడు రూపములతో వేర్వేరుగా భాసించుచున్నవి (72). నీ స్వరూపమును నీవే విచారణ చేయుము. నీవు నీ లీలచే దేహమును ధరించి యున్నావు. అద్వయ బ్రహ్మవు నీవే. సగుణ బ్రహ్మవు నీవే. మేము ముగ్గురము నీ అంశలమై యున్నాము. (73). ఒకే దేహమునందు శిరస్సు, మెడ ఇత్యాది అంగములు వేర్వేరుగా నున్నవి. హే హరా! అటులనే మేము

ముగ్గురము శివుని మూడు అంగములుగా నున్నాము (74). అగ్ని, మేఘము నీ నివాస స్థానములు. నీవు సనాతనుడవు. వికార రహితుడవు. అవ్యక్తుడవు. నీకు అనంతరూపములు గలవు. నీవు నిత్యుడవు. నీయందు దీర్ఘము మొదలగు విశేషణములు లేవు. నీవు శివుడవు. సర్వము నీ నుండియే ఉద్భవించినది (75).

బ్రహ్మోవాచ |

ఏతచ్ఛ్రుత్వా వచస్తస్య మహాదేవో మునీశ్వర | బభూవ సుప్రసన్నశ్చన జఘాన స మాం తతః || 76

ఇతి శ్రీ శివ మహాపురాణ ద్వితీయాయాం రుద్ర సంహితాయాం ద్వితీయే సతీఖండే సతీ వివాహ శివలీలా వర్ణనం నామ ఏకోనవింశోఽధ్యాయః (19).

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఓ మహర్షీ! మహాదేవుడు అతని ఈ మటలను విని మిక్కిలి ప్రసన్నుడాయెను. మరియు ఆయన అపుడు నన్ను సంహరించలేదు (76).

శ్రీ శివ మహాపురాణములోని రెండవది యగు రుద్ర సంహితయందు రెండవది యగు సతీఖండములో సతీవివాహ శివలీలా వర్ణనమనే పందొమ్మిదవ అధ్యాయము ముగిసినది (19).